క్లుప్తంగా

రైతుల వివరాల నమోదు



రైతుల వివరాలు నమోదు చేస్తున్న వీఏఏ శివకుమార్

సారవకోట: మండలంలోని చిన్నకిట్టాలపాడు రైతు భరోసా కేంద్రం రైతులతో సోమవారం కిటకిటలాడింది. ప్రభుత్వం అదనంగా వేయి టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతి ఇవ్వడంతో షెడ్యూల్స్ తయారు చేయించుకునేందుకు రైతులు ఆర్‌బీకేకు చేరుకున్నారు. రైతులకు చెందిన ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ.. దళారుల హవా మండలంలో ఎక్కువగా నడుస్తుంది. రైతుల నుంచి పాస్ పుస్తకాలు సేకరించి దళారులు, మధ్యవర్తులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకుంటున్నారు. చిన్నకిట్టాలపాడు ఆర్‌బీకేలో రైతులతోపాటు దళారులు కన్పించడం అక్కడ చర్చనీయాంశంగా మారింది.

జీవామృతంతో పంటలకు మేలు



జీవామృతం తయారీని వివరిస్తున్న దృశ్యం

హిరమండలం: జీవామృతంతో పంటలకు మేలు కలుగుతుందని ప్రకృతి సేద్యం ప్రతినిధి రాములమ్మ అన్నారు. మండలంలోని గులుమూరు గ్రామానికి చెందిన గంటిడ జ్యోతి ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న కూరగాయల పంటలను సోమవారం పరిశీలించారు. రైతులకు జీవామృతం తయారీ వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. తయారీ విధానాన్ని వివరించారు. ఇది చల్లడం వల్ల పంటలకు ఎటువంటి చీడపీడలు సోకవన్నారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి



ఆధార్ అప్‌డేట్ కోసం వేలిముద్ర వేస్తున్న ఎంపీపీ

నరసన్నపేట: మండలంలో 39 వేల మంది ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉందని, ప్రతిఒక్కరూ గమనించాలని ఎంపీపీ ఆరంగి మురళి, ఎంపీడీఓ బి.మధుసూదనరావు అన్నారు. మండలంలో కోమర్తి, నరసన్నపేటలో సచివాలయం -3, గోపాలపెంట, తామారాపల్లి, లుకలాంలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామని, ఆయా గ్రామాల్లో ప్రజలు తమ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని కోరారు. నరసన్నపేట-3 సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ సేవలను పరిశీలించిన అనంతరం ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావులు సోమవారం ఆధార్ అప్‌డేట్ చేయించుకున్నారు. ఈ నెల 27 నుంచి 29 వరకు మరిన్ని గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీఆర్వో అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: ఆధార్ కార్డులను 2016 జూన్‌కు ముందు తీసుకున్న ప్రతిఒక్కరూ తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ పావని సోమవారం తెలిపారు. మండలంలోని కొత్తూరు-1, మదనాపురం, కర్లెమ్మ, బలద, నేరడి గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఈ నెల 20, 21, 27, 28, 29 తేదీల్లో పనిచేస్తాయన్నారు.

ఏఎంసీ డైరెక్టర్ మృతికి స్పీకర్ సంతాపం

పొందూరు: స్థానిక మార్కెట్ కమిటీ డైరెక్టర్ బలగ రామారావు సోమవారం మృతి చెందారు. ఆయన కుటుంబానికి స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రగాఢ సంతాపం తెలిపారు. రామారావు కుటుంబానికి రూ.20 వేలు, క్వింటా బియ్యాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుల అందజేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎల్ సునీల్‌కుమార్, జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, సర్పంచ్ రేగిడి లక్ష్మిలు ప్రగాఢ సంతాపం తెలిపారు.

సీపీ చైర్ అందజేత



సీపీ చైర్‌ను పంపిణీ చేస్తున్న ఎంఈఓ రామారావు

ఆమదాలవలస రూరల్: ప్రత్యేకావసరాల చిన్నారులకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందజేస్తుందని ఎంఈఓ దుప్పల రామారావు అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో చింతాడ గ్రామానికి చెందిన పట్నాన అను అనే చిన్నారికి కాన్పూర్‌కు చెందిన అలీమ్ కార్పొరేషన్ ద్వారా పంపిణీ చేసిన సీపీ (సెరిబ్రల్ ప్లాసీ) చైర్‌ను సోమవారం అందజేశారు. ప్రత్యేక అవసరాల చిన్నారులకు ఇంటి వద్ద తల్లిదండ్రులు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ నిర్వహించడం వల్ల కొంతమేర ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తుందని, వాటిని వినియోగించుకోవాలన్నారు. ఐఈఆర్ టీచర్స్ పూజారి శ్రీధర్, పి.కృష్ణప్రసాద్, సీఆర్పీలు పాల్గొన్నారు.

● వైద్య సేవలపై ఆరా



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు మెరుగుపడాలని టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం ఆయన సారవకోట మండలంలోని బొంతు, సారవకోట పీహెచ్‌సీల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ రెండు పీహెచ్‌సీల్లో అనుకున్న స్థాయిలో ఓపీ నమోదు కాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిస్థాయి వైద్య సేవలందించాలని అన్ని చర్యలూ తీసుకుంటుందని, ఈ పీహెచ్‌సీల్లో అనుకున్న స్థాయిలో సేవలందడం లేదన్నారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. తహసీల్దార్ ప్రవల్లికాప్రియ, వైద్యులు సౌమ్య, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

- సారవకోట

● 73 మందికి వైద్య పరీక్షలు



హిరమండలం మండలంలోని పిండ్రువాడలో గల ఆర్‌బీకే ఆవరణంలో అమ్మన్న చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రి వైద్యాధికారి రితీష్ కృష్ణ 73 మందికి వైద్య పరీక్షలు చేపట్టారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు తంగి రమేష్, ఏఎన్‌ఎం నిర్మల, ఎంఎల్‌హెచ్‌పీ కవిత, ఆశ కార్యకర్తలు సత్యవతి, మీన, పీఆర్వో దుర్గారావు పాల్గొన్నారు.

- హిరమండలం

● విద్యార్థికి అభినందన



స్టేట్‌లెవల్ సైన్స్ ఇన్‌స్పైర్ సెలక్షన్‌కు ఈదులవలస ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ విద్యార్థి వై.సాయికిశోర్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పి.ప్రవీణ తెలిపారు. 10వ తరగతి చదువుతున్న సాయికిశోర్ తయారుచేసిన సెల్ఫ్ అలర్ట్ గార్డ్ పనితీరు, తయారుచేసిన విధానంపై ఆన్‌లైన్‌లో పంపించామని, ఈ ప్రాజెక్టు జిల్లా నుంచి స్టేట్‌లెవల్‌కు ఎంపికైందన్నారు. కోవిడ్-19 పరిస్థితుల్లో ఒకరిని ఒకరు తాకకుండా ఉండేలా, ఒకవేళ తాకితే ప్రత్యేక అలర్ట్ వచ్చేలా చేసిన ఏర్పాటు చేసిన ప్రాజెక్టుకు గుర్తింపు వచ్చిందని విద్యార్థి సాయికిశోర్‌కు గైడ్‌చేసిన అధ్యాపకుడు బి.అప్పారావు (పీజీటీ జువాలజీ) అన్నారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థి సాయికిశోర్‌కు ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

-పోలాకి

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● డివిజన్ స్థాయి స్పందనలో పాల్గొన్న సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి



వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి

సారవకోట: విధి నిర్వహణలో సచివాలయ, రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. మండలంలోని మహాళింగి గ్రామంలో సోమవారం డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. రిజిస్టర్ డాక్యుమెంట్లు ఉన్నప్పటికీ తమకు 1బీ రావడం లేదని బొంతు గ్రామానికి చెందిన పలువురు రైతులు సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. చిన్నగుజ్జువాడ పంచాయతీలో రెండు గ్రానైట్ క్వారీలు నిర్వహిస్తున్నప్పటికీ.. ఆ క్వారీలకు సంబంధించిన సీనరీస్ తమ పంచాయతీకి మంజూరు కావడం లేదని సర్పంచ్ కొండాల బాబూరావు వినతిపత్రం అందజేశారు. ధర్మలక్ష్మీపురం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సర్పంచ్ జన్ని అనురుద్రుడు విన్నవించారు. మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు చేయలేదని పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన సబ్‌కలెక్టర్.. పూర్తిస్థాయి నివేదిక తయారు చేసి ఇవ్వాలని వ్యవసాయాధికారి వెంకటరావుకు సూచించారు. తన భర్త మృతి చెందిన 8 నెలలైనా వితంతు పింఛన్ మంజూరు చేయలేదని కొత్తపేట గ్రామానికి చెందిన దుంపల కృష్ణవేణి వినతిపత్రం అందించారు. దీనిపై ధర్మలక్ష్మీపురం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులను సబ్ కలెక్టర్ వివరణ కోరారు. సరైన సమాధానం చెప్పకపోవడంతో వారికి జీతం నిలుపుదల చేయాలని డీఎల్‌డీఓ అలువేలు మంగమ్మను ఆదేశించారు.

గ్రామ స్థాయిలోనే పరిష్కరించాలి..

స్పందన అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే మండలంలో పలు సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయన్నారు. గ్రామస్థాయిలో సమస్యలు గుర్తించి.. వాటిని పరిష్కరించేందుకే ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకుచ్చిందన్నారు. సచివాలయాల సిబ్బంది బాధ్యతగా పని చేయకపోవడంతోనే చిన్న, చిన్న సమస్యలు డివిజన్ స్థాయిలో నిర్వహించిన స్పందనకు వస్తున్నాయన్నారు. రెండు వేల మందికి ప్రభుత్వం మంజూరు చేసే సంక్షేమ పథకాలు అందించేందుకు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. మండల స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు సచివాలయాలను పర్యవేక్షించాలన్నారు.

మండల, డివిజన్ స్థాయి అధికారులు వసతి గృహాలను పర్యవేక్షించాలని, వారానికి ఒకసారి వసతిగృహాల్లో బస చేయాలన్నారు. విద్యార్థులకు మెనూ సరిగ్గా అమలు చేస్తున్నారా, వసతులు న్నాయా, లేదా అనే విషయాలు పరిశీలించాలన్నారు. తహసీల్దార్ ప్రవల్లికాప్రియ, గృహనిర్మాణ శాఖ డీఈఈ అప్పారావు, ఫారెస్ట్ రేంజర్ రాజశేఖర్, ఎంపీడీఓ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యుల ప్రవర్తన సరికాదు



ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: అసెంబ్లీలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేల ప్రవర్తన స్పీకర్ తమ్మినేని సీతారాంను అవమానించేలా ఉన్నాయని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. సోమవారం శాసన సభలో టీడీపీ ఎమ్మెల్యేలు మితిమీరి ప్రవర్తించాలని, ప్లకార్డులు స్పీకర్ ముఖంపై పెట్టారని, చైర్ వద్దకు దూసుకెళ్లారఅన్నారు. మాట్లాడితే సీనియర్ ఎమ్మెల్యేలమని చెప్పుకుంటారని, ఇదేనా వారు సభకు, స్పీకర్‌కు ఇచ్చిన మర్యాద అని తప్పుపట్టారు. వీరిని ఎందుకు ఎన్నుకున్నామని ప్రజలు బాధ పడే రోజు వచ్చిందన్నారు. వాయిదా తీర్మాణం పెట్టి సభ అమోదించాలని, చర్చకు అనుమతించకపోతే దౌర్జన్యానికి దిగటం ఏమాత్రం సరైన పద్ధతి కాదన్నారు. ప్రతీరోజు స్పీకర్ పోడియం చుట్టూ చేరి సభ సక్రమంగా జరగనీయకుండా అడ్డుకుంటున్నారన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు హుందాగా ప్రజల పక్షాన పోరాడాలే గానీ, అధికార పార్టీ నాయకులపైన, స్పీకర్‌పైన దౌర్జన్యం చేయటం కాదన్నారు.

గిరిజనులకు న్యాయం చేయండి

మెళియాపుట్టి: గిరిజనులు తరతరాలుగా సాగుచేసుకుంటున్న భూములను గిరిజనేతరులు ఆక్రమించుకుంటున్నారని జిల్లా రెవెన్యూ అధికారి దృష్టికి పరశురాంపురం మాజీ సర్పంచ్ జన్ని రామకృష్ణ తీసుకెళ్లారు. సోమవారం శ్రీకాకుళంలో కలిసి వినతిపత్రాన్ని అందించారు. గతకొన్నేళ్ల క్రితం నందవలో గిరిజనులు పోడు వ్యవసాయం చేస్తున్న సమయంలో గిరిజనేతరులు ఆక్రమించుకోవడానికి ప్రయత్నాలు చేయడంతో అప్పట్లో అడ్డుకున్నట్లు తెలిపారు. గిరిజనుల ఫిర్యాదుతో కోర్టులో కేసులు నడుస్తున్నాయన్నారు. ఇటీవల మరలా పలువురు గిరిజనేతరులు ఆ భూములను చదును చేయడంతో వివాదం చెలరేగిందన్నారు. టెక్కలి ఆర్డీఓ, మెళియాపుట్టి తహసీల్దార్‌లకు ఈ సమస్యపై పూర్తి వివరాలు తెలుసుకుని, వివరాలు అందివ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి ఆదేశాలు జారీ చేశారు.

అభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సరుబుజ్జిలి: అభివృద్ధే ప్రధాన అజెండాగా భావించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు తెలిపారు. మండలానికి అదనంగా యరగాం, గోనెపాడు గ్రామాలకు గ్రామ సచివాలయాలు మంజూరైన సందర్భంగా యరగాం గ్రామంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. స్పీకర్ తమ్మినేని సీతారాం చొరవతో రెండు సచివాలయాలు మంజూరయ్యాయని వెల్లడించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా పరిపాలన సౌలభ్యం కోసం ఈ రెండు సచివాలయాలు మంజూరు చేయడం మంచి నిర్ణయమని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి స్పీకర్ తమ్మినేని పెద్దపీట వేస్తున్నారని గుర్తుచేశారు. మరికొద్ది రోజుల్లో స్పీకర్ తమ్మినేని సీతారాం చేతులు మీదుగా తాత్కాలిక సచివాలయ భవనాలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు బాన్న రాము, రావాడ రవి, వెలమల కృష్ణ, బెండి అప్పలనాయుడు, కొర్ను గోవిందరావు, పున్నపురెడ్డి తవిటినాయుడు, బద్రి రామారావు, సనపల తవుడు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన టెన్త్ ప్రశ్నపత్రాలు

నరసన్నపేట: మండలంలో టెన్త్ పరీక్ష కేంద్రాలకు సరఫరా చేయాల్సిన టెన్త్ ప్రశ్నపత్రాలు స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరాయి. ఆది, సోమవారాల్లో రెండు సెట్‌ల ప్రశ్నపత్రాలు వచ్చాయి. వీటిని పరీక్షా కేంద్రాల ఇన్‌చార్జిలు సమక్షంలో బద్ర పరిచారు. నరసన్నపేట మండలంలో ఆరు కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. తిలారు, నిమ్మాడ, నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, సెంట్‌క్లారెట్, రవీంద్ర భారతి, నారాయణ కేంద్రాలకు చెందిన చీఫ్‌లు, డీఓలు పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం ప్రత్యేక పూజలు



స్ఫటిక శివలింగానికి పూజలు చేస్తున్న దృశ్యం

పొందూరు: లోక కల్యాణానికి, హిందూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు మండలంలోని కృష్ణాపురం ఆనందాశ్రమంలో స్పటిక లింగేశ్వరునికి శ్రీనివాసానంద స్వామి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఎటువంటి విపత్తులు సంభవించకూడదని, పంటలు బాగా పండాలని, వ్యాధులు ప్రబలకుండా ఉండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని పూజలు చేపట్టారు. భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయం



మాట్లాడుతున్న కార్పొరేషన్ డైరెక్టర్లు

నరసన్నపేట: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికారం వైఎస్సార్‌సీపీదేనని నరసన్నపేట నియోజకవర్గంలోని కార్పొరేషన్ డైరెక్టర్లు ధీమా వ్యక్తం చేశారు. శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ, దేవాంగుల కార్పొరేషన్ డైరెక్టర్ మల్లికార్జున స్వామి, కళింగ కోమట్ల కార్పొరేషన్ డైరెక్టర్ పి.సాయిప్రసాద్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నాయకుడు కణితి కృష్ణారావు సోమవారం నరసన్నపేటలో విలేకర్లతో మాట్లాడారు. పట్టభద్రుల ఎన్నికల్లో విజయం సాధించినంత మాత్రాన సార్వత్రిక ఎన్నికల్లో తమదే అధికారమని టీడీపీ నాయకులు ప్రగల్బాలు పలుకుతున్నారని, వారివి పగటి కలలే అవుతాయన్నారు. ఉత్తరాంధ్రాతోపాటు మిగతా ప్రాంతాలను పరిగణలోనికి తీసుకుంటే ఓటింగ్‌లో పాల్గొన్న వారు ఎంతమంది, మెజార్టీ ఎంత, ఎంత శాతం వ్యత్యాసం ఉందనేది గమనించాలన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ నాయకత్వంలో పార్టీ గత ఎన్నికల కంటే.. రానున్న ఎన్నికల్లో జిల్లాలో అధికంగా సీట్లు సాధిస్తుందన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక బృందం ఏర్పాటు

జలుమూరు: మండల పరిధిలోని 40 పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రవికుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సోమవారం సమీక్షించారు. పంచాయతీ కార్యదర్శులు నీటి ఎద్దడి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా నీటి సమస్య ఉంటే రామశేషయ్య 94401 37660, అమరేంద్ర 94922 97731, చిరంజీవి 99857 36521 నంబర్లకు ఫోన్ చేసి సమస్య వివరించాలన్నారు. ఆయా సిబ్బంది వచ్చి నీటి సమస్య నినివారణకు తగిన చర్యలు తీసుకుంటారన్నారు.

పుట్టపర్తి యువ సంకల్ప యాత్రకు పయనం



పుట్టపర్తికి బయలుదేరిన యువతీ యువకులు

ఆమదాలవలస రూరల్: పుట్టపర్తిలో సత్యసాయి ప్రశాంతి నిలయంలో ఉగాది సందర్భంగా నిర్వహించనున్న యువ సంకల్ప యాత్రకు మండలం నుంచి యువతీయువకులు ఆదివారం పయనమయ్యారు. సత్యసాయి యువజన విభాగం అధ్యక్షుడు ఎన్ని లింగరాజు ఆధ్వర్యంలో 45 మంది ఆమదాలవలస రైల్వేస్టేషన్ నుంచి పుట్టపర్తికి బయలుదేరారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో సేవలు అందించనున్నట్లు తెలిపారు.

పిచ్చుకలను సంరక్షించాలి



చిత్రలేఖనాలను చూపుతున్న విద్యార్థులు

పొందూరు: పర్యావరణ సమతుల్యతలో పిచ్చుకల పాత్ర కూడా కీలకమని లోలుగు కేజీబీవీ ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య, తాడివలస ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లఖినేని హేమనాచార్యులు అన్నారు. అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా ఆయా పాఠశాలల్లో సోమవారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. సెల్ టవర్లు, ఫెర్టిలైజర్స్ కారణంగా పిచ్చుకల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఆయా పాఠశాలల్లో నిర్వహించిన చిత్ర లేఖనం, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. నేషనల్ గ్రీన్ కోర్ క్లస్టర్ కో ఆర్డినేటర్ పూజారి హరిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో సత్తా

ఆమదాలవలస: పట్టణంలోని పతాంజలి యోగా శిక్షణ కేంద్రానికి చెందిన 11 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగాసనాల పోటీల్లో విజేతలుగా నిలిచారని యోగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లగుడు అప్పన్న సోమవారం తెలిపారు. ఈ నెల రెండో వారంలో శ్రీకాకుళం పట్టణానికి చెందిన వివేకానంద జ్ఞాన యోగా శిక్షణ కేంద్రం, విశాఖకు చెందిన రెడ్డీస్ యోగా శిక్షణ కేంద్రం సంయుక్తంగా రాష్ట్ర స్థాయి ఆన్‌లైన్ యోగా పోటీలు నిర్వహించాయన్నారు. విజేతలకు పతాంజలి యోగా శిక్షణ కేంద్రంలో సర్టిఫికేట్లు, జ్ఞాపికలు అందజేశారు. యోగా చాంపియన్ లగుడు లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, జిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శి బి.దక్షిణామూర్తి, ఉపాధ్యక్షురాలు కె.శ్రీదేవి, డాక్టర్ ఎండ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

17 లీటర్ల సారా స్వాధీనం

పాతపట్నం: ఒడిశా నుంచి అక్రమంగా 17 లీటర్ల నాటు సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశామని ఎస్‌ఐ ఎన్.కామేశ్వరరావు తెలిపారు. పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు సోమవారం తనిఖీలు చేపట్టారన్నారు. పాతపట్నం మేజర్ పంచాయతీ శివశంకర్ కాలనీకి చెందిన అన్నదమ్ములు కర్రి ఆదినారాయణ, కర్రి చంద్రశేఖర్ నాటుసారాతో పట్టుబడినట్లు తెలిపారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు



నృత్యం చేస్తున్న భవిత పాఠశాల విద్యార్థులు

ఆమదాలవలస: పట్టణంలోని భవిత పాఠశాలలో సోమవారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. పలు సినీ, సంప్రదాయ గీతాలకు నృత్యాలు వేసి ఆకట్టుకున్నారు. ఎన్ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు భయం వీడి పరీక్షలకు హాజరైతే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ఎస్.మురళీధరరావు, డైరెక్టర్ సువ్వారి సునీత, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అప్పలనాయుడు మృతి పార్టీకి తీరనిలోటు



అప్పలనాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పోలాకి: వైఎస్సార్‌సీపీ నాయకుడు తమ్మినేని వెంకట అప్పలనాయుడు మృతి పార్టీకి తీరని లోటని, సత్రవుపేట గ్రామంలో పార్టీలకు అతీతంగా ప్రజలందరూ ఐకమత్యంగా ఉండాలని కోరుకునేవారని మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు అన్నారు. సత్రవుపేటలో వెంకట అప్పలనాయుడు సంతాపసభ సోమవారం నిర్వహించారు. అప్పలనాయుడు రాజకీయాల్లోకి రాక ముందు సర్వేయర్‌గా విధులు నిర్వహించారని, ఆ సమయంలో కూడా మంచి వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారని విశ్వశాంతి డైరెక్టర్ మెట్ట జనార్దనరావు అన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు కణితి కృష్ణారావు, పార్టీ నాయకులు చింతాడ ప్రసాదరావు, చింతు సింహాచలం, చింతాడ ఉమామహేశ్వరరావు, కణితి సత్తిబాబు, రెంటికోట త్రినాథరావు, పూజారి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

విధులకు డుమ్మా

సారవకోట: మండలంలోని వాండ్రాయి సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఉద్యోగులు ముందస్తు అనుమతి లేకుండా విధులకు డుమ్మా కొట్టడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీఓ విశ్వేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ నెల 10 నుంచి విధులకు హాజరు కావడం లేదన్నారు. ఈ విషయాన్ని ఏడీ సర్వేయర్, డీపీఓల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇదిఇలా ఉండగా.. అదే సచివాలయంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న తన కుమార్తె ఈ నెల 10 నుంచి కన్పించడం లేదని ఆమె తల్లి ఈ నెల 17న స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది.

ఇంటింటా ఫీవర్ సర్వే

ఎల్.ఎన్.పేట: ఇంటింటా ఫీవర్ సర్వే చేయాలని ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్ గ్రామ సచివాలయ, వైద్య సిబ్బందికి సూచించారు. ఇంటింటికీ వెళ్లి జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి వివరాలను తెలియజేయాలన్నారు. శ్యామలాపురం వంశధార పునరావాస కాలనీలో సోమవారం ఇంటింటా ఫీవర్ సర్వేను చేపట్టారన్నారు. అన్ని గ్రామాల్లోనూ సర్వే వివరాలను సాయంత్రం ఆన్‌లైన్‌లో తెలియజేయాలని సూచించారు.

వేంకటేశ్వరాలయంలో ఉగాది సంబరాలు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వరాలయంలో ఉగాది రోజున భజ గోవిందం సేవా సమితి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించనున్నట్లు సమితి ప్రతినిధులు గొండు స్వామిబాబు, శిమ్మ లక్ష్మణరావు, బోయిన ఆనందరావు తెలిపారు. ఆలయం వద్ద సోమవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. స్వామిబాబు మాట్లాడుతూ బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 8 గంటలకు పంచాగ శ్రావణం ఉంటుందన్నారు.

22 నుంచి ఉగాది వేడుకలు

పాతపట్నం: స్థానిక ఆల్‌ఆంధ్రా రోడ్డు సమీపంలోని షిర్డీ గిరిపై ఉన్న షిర్డీసాయి బాబా ధ్యాన మందిరంలో ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు ఉగాది వసంతోత్సవ వేడుకలను నిర్వహించనున్నారు. బాబా సేవా సంఘం సభ్యుడు తారకేశ్వరరావు సోమవారం తెలిపారు. 22న పంచాంగ శ్రావణం, 23న భక్తి సంగీత విభావరి, 24న విద్యార్థులకు వ్యాచరచన పోటీలు, 25న చిత్రలేఖనం పోటీలు, 26న ముగ్గుల పోటీలు, శాస్త్రీయ నృత్య ప్రదర్శన, 27న వక్తృత్వ, 28న భగవద్గీత శ్లోకాల పోటీలు, 29న నీతి కథల పోటీలు, 30న సీతారామ కల్యాణం తోపాటు విచిత్ర వేషధారణలు, శాస్త్రీయ సంగీతం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

జలుమూరు: మండల కేంద్రంలోని కేజీబీవీలో 6, 7, 8వ తరగతుల్లో మిగులు సీట్లు భర్తీకి ఈ నెల 27వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఓ శారద సోమవారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

బూర్జ: మండలంలోని పాలవలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ జిల్లా అదనపు ప్రాజెక్టు అధికారి తిరుపతిరావు సోమవారం పర్యటించారు. కూరగాయల పంటలను పరిశీలించారు. నవ ధాన్యాల విత్తన కిట్లు, ప్రకృతి వనరుల కేంద్రంలో ఉన్న కషాయాల ఉత్పత్తులను సందర్శించారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. మాస్టర్ ట్రైనర్ చిన్నమ్మడు, యూనిట్ ఇన్‌చార్జి జి.జనార్దనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు అనుమతులు

కొత్తూరు: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని కొత్తూరు, హిరమండలం, ఎల్‌ఎన్‌పేట, సరుబుజ్జిలి మండలాల నుంచి వేయి టన్నులు ధాన్యం సేకరణ చేయాలంటూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు సబ్‌డివిజన్ ఏడీ రాజగోపాలరావు సోమవారం తెలిపారు. వేయి టన్నుల ధాన్యం షెడ్యూల్ పూర్తయిన తరువాత మరో 700 టన్నుల ధాన్యం సేకరణకు అనుమతిస్తుందన్నారు.

షట్టర్లు బాగుచేయాలి

ఎల్.ఎన్.పేట: ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి మండలాల్లోని సుమారు 750 ఎకరాలకు సాగునీరు అందించేందుకు బొర్రంపేట గ్రామానికి సమీపంలో నిర్మించిన కడగండి రిజర్వాయర్ షట్టర్లు బాగుచాలని బొర్రంపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డేపల్లి చిట్టిబాబు, వార్డు సభ్యుడు కింతలి రవికుమార్ సోమవారం కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేశారు. కుడి, ఎడమ కాలువల నిర్మాణం చేపట్టి సాగునీరు అందించాలని 2021 జూలైలో స్పందనలో ఫిర్యాదు చేశామని గుర్తుచేశారు. షట్టర్లు పూర్తిగా పాడవ్వటంతో రిజర్వాయర్‌లో నీరు నిల్వ లేకుండా బటకు వెళ్లిపోతుందని వివరించారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఎస్ఈకి కలెక్టర్ సిఫార్స్ చేశారు.

జీడి పిక్కల ప్రోసెసింగ్ యూనిట్ నిర్వహణపై శిక్షణ

కొత్తూరు: మండలంలోని ఐదు గిరిజన గ్రామలాకు మంజూరైన జీడి పిక్కల ప్రోసెసింగ్ యూనిట్ నిర్వహణకు కోసం ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి వన ధన్ వికాస కేంద్రాల సభ్యులు నుంచి 20 మంది చొప్పున్న 100 మందికి కొత్తూరులోని అర్చిక్ స్వచ్ఛంద సంస్థలో సోమవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని వెలుగు ఏపీఎం ఆధ్వర్యంలో ఏపీడీ బెవర నారాయణరావు శిక్షణ ఇచ్చారు. ఒక్కో సెంటర్‌కు కమిటీలు ఎలా నిర్ణయించాలన్నది వివరించారు. ప్రోసెసింగ్ చేసిన జీడిపిక్కలకు ఎంత శాతం లాభం వేసుకుని విక్రయించాలో తెలియజేశారు. ఏసీ ఆర్.వి.రమణ, ఏపీఎం త్రినాథమ్మ, పలువురు వెలుగు అధికారులు పాల్గొన్నారు.

క్షేత్రసహాయకుడిని నియమించండి

మెళియాపుట్టి: మండలంలోని ఆంపురం గిరిజన గ్రామ పంచాయతీకి క్షేత్రసహాయకుడిని నియమించాలని గ్రామస్తులు డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజును కలిసి వినతిపత్రాన్ని అందించారు. సోమవారం శ్రీకాకుళంలో అతనిని కలిశారు. సుమారు 200 జాబ్‌కార్డులున్న గ్రామ పంచాయతీలో ఎటువంటి బాధ్యతలు లేని ఓ వ్యక్తి క్షేత్రసహాయకునిగా విధులు నిర్వహిస్తున్నట్లు పీడీ దృష్టికి వాబ జగన్, నేలబొంతు రవికుమార్, పోలయ్య, లక్ష్మమ్మ, సరస్వతి తదితరులు తీసుకెళ్లారు.